


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 46 శుక్రవారం 14-02-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## సాంకేతికరంగంలో సత్తాచాటాలి

### మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించడం గర్వంగా ఉంది

### మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని అవకాశాలు : సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్,ఫిబ్రవరి13:** యువత సాంకేతికరంగంలో తమ సత్తాను చాటాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మైక్రోసాఫ్ట్ విస్తరణతో యువతకు మరిన్ని ఉద్యోగాలు లభించనున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మరో కొత్త మైక్రోసాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించుకోవడం మనందరికీ గర్వకారణంగా ఉందని తెలిపారు. హైదరాబాద్ జర్నీలో ఇదొక మైలురాయి అని చెప్పారు. మైక్రోసాఫ్ట్, హైదరాబాద్ మధ్య సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో మైక్రోసాఫ్ట్ విస్తరణలో భాగంగా నూతన భవనాన్ని గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్‌లో ఏఐ సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్‌తో తమ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ ఇండియా ఇటీవలే 25 ఏళ్లు పూర్తి చేసుకుందని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ నుంచి గ్లోబల్ ఇన్నోవేషన్, ఇంపాక్ట్ క్రియేట్ చేసిందని తెలిపారు. ఇది యువతకు మరింత సాధికారత కల్పిస్తుందని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తు ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దేనని ఉద్ఘాటించారు. ఈ భాగస్వామ్యంతో తెలంగాణ, మైక్రోసాఫ్ట్ 500 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యను ప్రవేశపెట్టడంతో పాటు గవర్నెన్స్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ పెట్టుబడి తమ స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడంతోపాటు మెంటార్షిప్, ఏఐ టూల్స్, గ్లోబల్ నెట్‌వర్క్ యాక్సెస్‌ను చేస్తుందని అన్నారు. తమ ప్రభుత్వ సహకారంతో మైక్రోసాఫ్ట్ ఏఐ సెంటర్ ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

## వక్ఫ్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### నిరసనల మధ్యే ప్రవేశ పెట్టిన ప్రభుత్వం

### గందరగోళం మధ్య సభ వాయిదా



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13:** 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) రూపొందించిన నివేదికను కేంద్ర ప్రభుత్వం గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బిజెపి ఎంపీ సంజరు తదితరులు ఈ ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో సభ ముందుకు తీసుకొచ్చారు. ఈ బిల్లుపై నివేదికను రాజ్యసభ ఎంపీ మేధా కులకర్ణి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సభలో గందరగోళం నెలకొంది. నివేదికపై ప్రతిపక్ష ఎంపీలు నిరసన తెలిపారు. తాము సమర్పించిన డిస్సెంట్ (అసమ్మతి) నోట్‌ను తొలగించారంటూ నిరసనకు దిగారు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ 20 నిమిషాల పాటు వాయిదా వేశారు. అనంతరం సభ ప్రారంభమైనప్పటికీ ప్రతిపక్షాలు తమ నిరసనను కొనసాగించాయి. ఈ నిరసనల మధ్యే ఈ నివేదికకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కాగా, జనవరి 29న ముసాయిదా నివేదికను జెపిసి ఆమోదించిన విషయం తెలిసిందే. బీజేపీ సభ్యులు సూచించిన 14 సవరణలను కమిటీ ఆమోదించింది. అయితే కాంగ్రెస్, డీఎంకే, టీఎంసీ, ఆప్, శివసేన(యూబీటీ), ఏఐఎంఐఎంతో సహా ప్రతిపక్ష సభ్యులు సూచించిన ప్రతి మార్పును కమిటీ తిరస్కరించింది. ఈ సవరణలతో వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులు కూడా సభ్యులుగా ఉంటారు. ఈ బిల్లుపై ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదింపజేసుకుంది.

## 19న బిఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

### - కెసిఆర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు - ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించే అవకాశం




**హైదరాబాద్,ఫిబ్రవరి13:** ఈ నెల 19న భారత రాష్ట్ర సమితి విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరుగనున్నది. తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశాశం జరుగనుంది. త్వరలోనే పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుక జరుగనున్నది. ఈ క్రమంలో నే విస్తృత స్థాయి కార్యవర్గాన్ని సమావేశ పరచాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు భేటీ నిర్వాహణకు సంబంధించి పార్టీ కార్యవర్గ నిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం, నిర్మాణాత్మక అంశాలపై చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలలపై చర్చించడంతో పాటు వాటిని ఎండగట్టేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. ప్రజలను చైతన్యం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కేసీఆర్ అధ్యక్షతన పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా పార్టీ అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ, ఎంపీలు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పోరేషన్ ఛైర్మన్లు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు.. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు హాజరవుతారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలమీద ప్రధానంగా చర్చ జరగనుంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు చేపట్టవలసిన కార్యాచరణపై సమగ్ర చర్చ జరగనుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకుంటూ, తమ హక్కులను తాము కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం అనుసరించాల్సిన వ్యూహాలు విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. సమగ్ర చర్చ జరిపి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే కీలక సమావేశం కాబట్టి ఆహ్వానితులందరూ రావాలని కేటీఆర్ స్పష్టం చేశారు.

## బిసి రిజర్వేషన్లపై చేతులు దులుపుకుంటే కుదరదు

### అసెంబ్లీలో అందుకు అనుగుణంగా బిల్లులు పెట్టాలి

### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



**జనగామ,ఫిబ్రవరి13:** మోసాలు చేయడంలో ఆరితేరిన గుణం కాంగ్రెస్ పార్టీదని,మాటలు చెప్పి మోసం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. అదో దాఖాబాజ్ పార్టీ అని అన్నారు. జనగామ జిల్లా పర్యటనలో బీసీ బిల్లుపై కవిత స్పందించారు. బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపి చేతులు దులుపుకుంటే కుదరదన్నారు. అసెంబ్లీలో ఒక్క బిల్లు కాకుండా.. మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యలో 46 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక బిల్లు తేవాలని.. ఉద్యోగాల్లో 46 శాతం రిజర్వేషన్లకు మరొక బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. 42 శాతం స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ఈ మేరకు బీసీలకు రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తేవాలన్నారు.

## హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటు

### సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఎంవోయూ



**హైదరాబాద్,ఫిబ్రవరి13 :** హైదరాబాద్‌లో గూగుల్ ఎఐ సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఈ మేరకు సిఎం రేవంత్ సమక్షంలో ప్రభుత్వంతో గూగుల్ ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకుంది. టి హబ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సిఎం రేవంత్, ఐటిశాఖ మంత్రి శ్రీధర్ బాఉబ, సెక్రటరీ జయేశ్ రంజన్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. కృత్రిమ మేధతో పాటు అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటును అందించనుంది. వ్యవసాయం, విద్య,రవాణారంగం, డిజిటల్ రంగంలో గూగుల్ సహకారం అందిస్తుందని ఆ సంస్థ ప్రతినధులు ప్రకటించారు.


## పోచంపల్లికి శ్రీనివాస్‌రెడ్డికి నోటీసులు

### నాలుగు రోజుల్లో తమ ముందు హాజరుకావాలని వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి13:** కోడిపందేల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి మొయినాబాద్ పోలీసులు గురువారం నోటీసులు ఇచ్చారు. కోడి పందాలు జరిగిన ల్యాండ్ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి చెందినదిగా పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. మొయినాబాద్ తోల్కట్ట గ్రామం సర్వే నెంబర్ 165/ఏలో ఈ ఫార్మ్‌హౌస్ ఉందని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల్లో ఆధారాలతో తమ ముందు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి హాజరు కావాలని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో పోచంపల్లిని నిందితుడిగా మొయినాబాద్ పోలీసులు చేర్చారు. సెక్షన్ 3 అండ్ 4 గేమింగ్ యాక్ట్ కింద్ కేసు నమోదు చేశారు. సెక్షన్ 11 యానిమల్ యాక్ట్ కింద మరో కేసు నమోదు చేశారు. ఫార్మ్ హౌస్‌లో బెట్టింగ్స్ చేస్తూ పందాలు ఆడిస్తున్నట్లు మొయినాబాద్ పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ రెడ్డి ఫార్మ్‌హౌస్‌ను సబ్ లీజుకు భూపతి రాజు శివకుమార్ వర్మ అలియాస్ గబ్బర్ తీసుకున్నారు. ఫార్మ్‌హౌస్‌లో భారీ సెటప్‌తో కోడి పందాలను గబ్బర్ నిర్వహించాడు. అయితే కోడిపందాలకు సంబంధించి మరి కొంతమందిని విచారించే అవకాశాలు ఉన్నాయి. కాగా.. మూడు రోజుల క్రితం నగర శివారులో భారీ క్యాసినోను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన కలకలం రేపింది. మొయినాబాద్‌లోని ఫామ్ హౌస్‌పై దాడి చేసిన రాజేంద్రనగర్ పోలీసులు.. కోళ్ల పందాలతోపాటు క్యాసినో నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేశారు. ఈ ఘటనలో 64 మందిని అరెస్టు చేశారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన

### కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13:** బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చెయ్యడంతో రాష్ట్రపతి పాలన దిశగా కేంద్రం నిర్ణయం తీసుకుంది. మైతేయి, కుకీ తెగల మధ్య జరుగుతున్న ఘర్షణల కారణంగా మణిపూర్ అట్టుడు కుతోంది. ఈ క్రమంలో సీఎం రాజీనామా చేశారు. మణిపూర్ అల్లర్ల సందర్భంగా సీఎం బీరేన్ సింగ్ ఒక వర్గానికి కొమ్ము కాస్తున్నారని, ఒక వర్గాన్ని కావాలనే రెచ్చగొట్టి అల్లర్లకు మద్దతు ఇచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో సొంత పార్టీ నేతలే ఆయనపై విమర్శలకు దిగారు. అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తే విశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉండటం.. సొంత పార్టీ నేతలు విప్ ధిక్కరించి వ్యతిరేకంగా ఓటు వేసే పరిస్థితులు ఉన్నందున.. పార్టీ అధిష్టానం సీఎం బీరేన్ సింగ్ తో రాజీనామా చేయించింది. మణిపూర్ లో మే 2023 నుంచి అల్లర్లు జరుగుతున్నాయి. వందల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. అల్లర్లను నివారించడంలో విఫలమయ్యారనే విమర్శల నడుమ.. ఆదివారం (ఫిబ్రవరి 9 సీఎం రాజీనామా చేశారు. దీంతో తాజాగా రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. మే 2023 నుంచి మణిపూర్?లో తీవ్రమైన హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. నవంబర్ 7న జిరిబామ్‌లోని జైరాన్ గ్రామంలో హ్మార్ తెగకు చెందిన ఒక మహిళ, ముగ్గురు పిల్లలను మైతేయి మిలిటెంట్లు హత్య చేయడంతో మణిపూర్?లో మరోసారి అల్లర్లు తీవ్రరూపం దాల్చాయి. దీనికి ప్రతీకారంగా నవంబర్ 11న మైతేయి వర్గంపై కుకీ తీవ్రవాదులు ఎటాక్ చేశారు. అప్పట్నుంచి మణిపూర్ రావణకాష్టంలా మండుతూనే ఉంది. ప్రభుత్వం అల్లర్లను అదుపు చేయడంలో విఫలమైందని సొంత పార్టీ నేతలే తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సీఎం బీరేన్ సింగ్ రాజీనామా చేయగా.. ఆ తర్వాత రాష్ట్రపతి పాలన విధిస్తూ తాజాగా కేంద్రం నిర్ణయం తీసుకుంది.

## అమెరికా చేరుకున్న ప్రధాని మోడీ

- రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా తదితరుల స్వాగతం
- ద్వైపాక్షిక సంబంధాలపై ట్రంప్‌తో చర్చలు
- ఎలన్‌మస్క్‌తోనూ చర్చించే ఛాన్స్
- చారిత్రక బ్లెయిర్ హౌజ్‌లో మోడీకి బస



**వాషింగ్టన్,ఫిబ్రవరి13:** అమెరికాలో రెండు రోజుల పర్యటన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాషింగ్టన్‌కు చేరుకున్నారు. అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, ఇతర అధికారులు ప్రధాని మోదీని విమానాశ్రయంలో స్వాగతించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం గురువారం అమెరికాకు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానం మేరకు ఆయన అమెరికా పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి, భారతదేశం-యుఎస్‌ఎ సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిర్మించడానికి ఎదురుచూస్తున్నాను. మన దేశాలు, మన ప్రజల ప్రయోజనం కోసం మెరుగైన భవిష్యత్తు కోసం కలిసి పనిచేస్తూనే ఉంటాయి' అని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం తెల్లవారు జామున అమెరికాకు చేరుకున్నారు. ఫ్రాన్స్‌లో తన రెండు రోజుల పర్యటనను ముగించిన తర్వాత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను కలవడానికి. వారు ప్రతినిధి స్థాయి ఫార్మాట్లలో ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహిస్తారు. గురువారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగే సమావేశానికి ముందు మోడీ అదనపు సుంకాల కోతలకు సిద్ధమవుతున్నారు. ఇది భారతదేశానికి అమెరికన్ ఎగుమతులను పెంచవచ్చు. అధ్యక్షుడు ట్రంప్, డోజ్ అధిపతి ఎలాన్ మస్క్‌తో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా మోదీకి భారత సంతతి వారు ఘనంగా స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన అతిథి గృహంలో బస చేస్తున్నారు. 1651 పెన్సిల్వేనియా అవెన్యూలోని బ్లెయిర్ హౌస్ ఆయనకు ఆతిథ్యం ఇస్తోంది. ఈ భవనం శ్వేత సౌధానికి ఎదురుగా ఉండటం దీని విశేషం. అమెరికాలో పర్యటించే అత్యంత ప్రత్యేకమైన అతిథులకు ఇక్కడ బస ఏర్పాటు చేస్తారు. గతంలో చాలా మంది దేశాధ్యక్షులు, రాజకుటుంబ సభ్యులకు దీనిని విడిదిగా వాడారు. దౌత్యపరంగా ప్రాధాన్య మున్న భవనంగా దీనిని భావిస్తారు. ఇది కేవలం విలాసవంతమైన గెస్ట్‌హౌస్ మాత్రమే కాదు. అమెరికా ఆతిథ్యానికి చిహ్నంగా నిలిచింది. దాదాపు 70 వేల చదరపుటడుగుల్లో నాలుగు భవనాలు అనుసంధానమై ఉండటం దీని ప్రత్యేకత. ఇక్కడ మొత్తం 119 గదులు ఉన్నాయి. వీటిలో 14 బెడ్రూమ్‌లు, 35 బాత్ రూమ్‌లు, మూడు డైనింగ్ గదులున్నాయి. అత్యాధునిక బ్యూటీ సెలూన్ కూడా దీనిలో ఉంది. ఇక్కడి వచ్చిన అతిథులకు ఫైవ్‌స్టార్ ఆతిథ్యం ఇస్తారు. అమెరికా చరిత్రను తెలిపే పురాతన వస్తువులు, ఆర్ట్స్‌తో దీనిని అలంకరించారు. 1824లో ఈ భవనాలను నిర్మించారు. ప్రెస్టోన్ ఫ్రాన్సిస్ బ్లెయిర్ 1837లో కొనుగోలు చేశారు. ఆయన పేరును దీనికి పెట్టారు. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత శ్వేతసౌధానికి అతిథుల తాకిడి గణనీయంగా పెరిగింది. చాలా దేశాధినేతలు, సైన్యాధినేతలు అక్కడే బస చేసేవారు. ఆ తర్వాత 1942లో అమెరికా ప్రభుత్వం ఈ హౌస్‌ను అద్దెకు తీసుకొంది. ఆ ఏడాది చివరి నాటికి 1.56లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆ దేశ డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసీ గబ్బర్డ్‌తో భేటీ అయ్యారు. వీరిద్దరూ పలు అంశాలపై చర్చించారు. డీఎన్‌ఐగా ఆమె నేడు పదవీ బాధ్యతలు చేపట్టడం విశేషం.

# పిఓలు,ఏపీఓలు నిష్పక్షపాతంగా ఎన్నికల విధులను నిర్వర్తించాలి

**- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**



**తొలి సమయం హనుమకొండ**
ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో నిష్పక్షపాతంగా పీవోలు ఏపీవోలు విధులు నిర్వర్తించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నిర్వహణ పై ప్రిసైడింగ్ అధికారులు(పిఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల(ఏపీవో) మొదటి విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ( భీమదేవరపల్లి, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాలు) , జిల్లావ్యాప్తంగా జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లు భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, రవి ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణలో పిఓలు, ఏపీఓల పాత్ర కీలకమని అన్నారు. పోలింగ్ నిర్వహణ లో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.ఈకార్యక్రమంలో సిపిఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, పిఓలు ఏపీవోలు పాల్గొన్నారు.

# క్యాన్సర్ డే అవగాహన సదస్సు

**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 13**
టిచర్స్ లయన్స్ క్లబ్ తొర్రూర్ వారి ఆధ్వర్యంలో ఈ రోజు ఏపిలెప్సి ( మూర్ఛ వ్యాధి) ( లయన్ స్టిక్ ఇయర్ క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్) సందర్భంగా దాట్ల ఉన్నత ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో వెలిదె సురేష్ కుమార్ గారు మాట్లాడుతూ స్థానిక పిహెచ్సి వైద్యులు డాక్టర్ చైతన్య గారు మాట్లాడుతూ ప్రపంచ ఏపీలేప్సి ( మూర్ఛ వ్యాధి) దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు మూర్ఛ వ్యాధి సమస్యలు దాని నివారణ మార్గంపై విద్యార్థులకు వివరించడం జరిగింది. మూర్ఛ వ్యాధి వచ్చినప్పుడు పిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, వ్యాధిపట్ల అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థులకు సిపిఆర్ పై అవగాహన , వడదెబ్బ కలిపితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డి వార్మింగ్ డే పై అవగాహన, వివిధ ఆరోగ్య సమస్యలపై వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్ మాట్లాడుతూ ఏపీలేప్సి దినోత్సవం సందర్భంగా టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాట్ల పాఠశాల విద్యార్థులకు మూర్ఛ వ్యాధిపై, మరియు వివిధ



ఆరోగ్య సమస్యలపై వివరించడం జరిగిందన్నారు. టీచర్స్ క్లబ్ వివిధ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. టీచర్స్ లో సేవే మార్గం సేవే లక్ష్యంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీచర్స్ క్లబ్ అధ్యక్షులు చింతల సురేష్, ప్రధాన కార్యదర్శి వెలిదే సురేష్ కుమార్, స్థానిక వైద్య సిబ్బంది కమల, మణెమ్మ, కవిత కృపమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుమళ్ళ జాతర చాలి నంత ఫోకస్ కాలేదు

**ములుగు భద్రాద్రి కొత్త గూడానికి మధ్య రోడ్ వేస్తాము**

**జాతరలో పెద్ద ఎత్తున జనాన్ని సమీకరించిన చందా వంశీయులకు కృతజ్ఞతలు : మంత్రి సీతక్క**

**తొలిసమయం డెస్క్ ఫిబ్రవరి 13:**
చిరుమళ్ల జాతర కావాల్సినంత ఫోకస్ కాలేదని గ్రామీణ సభివృద్ధి శాఖ మంత్రి అన్నారు. సీతక్క అన్నారు చిరుమళ్ళ పుట్టు గద్దెల జాతర వద్ద గురువారం సమ్మక్క కళ్యాణం నిమిత్తం ముసలమ్మ గుట్ట నుండి సమ్మక్క తల్లిని గద్దెల వద్దకు తీసుకొని వచ్చిన సందర్భంగా హాజరు అయి మంత్రి సీతక్క మాట్లాడారు నేను గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి గా పనిచేస్తున్నాను అన్నారు కనుక జాతరను దృష్టిలో పెట్టుకొని రోడ్ వేపిస్తాను అన్నారు. ఈ ప్రాంతానికి ములుగు ప్రాంతానికి



రోడ్ వేపించే పనిలో ఉన్నాను అన్నారు చిరుమళ్ల జాతరను చాలా ఏండ్లు గా చందా వంశీయులు కొనసాగిస్తున్నారని అన్నారు జాతరకు బారీగా జనాన్ని కూడ గట్టరని, చందా వంశీయులకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ఇప్పచెట్టు జాతరకు ఆకర్షణగా ఉన్నది అన్నారు చెట్టు పుట్టలను ప్రేమించడమే మన సాంస్కృతి అన్నారు. వనదేవతలు అంటేనే చెట్లు పుట్టలను కాపాడడం అన్నారు. చందాలింగయ్య సమాలోచన అదారంగా జాతరను అభివృద్ధి చేస్తాను అన్నారు, ఈ కార్యక్రమం లో పిన పాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి: శ్రీమతి జి. భానుమతి**

**తొలిసమయం, ఇల్లందు. ఫిబ్రవరి. 13.**
గురువారం ఇల్లందు మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను,మరియు గిరిజన వసతి గృహాలను జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి శ్రీమతి జి. భానుమతి ఆకస్మిక తనిఖీలు చేసినారు. విద్యార్థి, విద్యార్థులకున మెనూ ప్రకారం సదుపాయాలు సక్రమంగా అందుతున్నాయో లేవో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు పాఠశాలలోని, శౌచాలయాలు, వంటశాలలను పరిశీలించినారు, పరిశుభ్రత పాటించాలని యజమాన్యానికి వారికి తగు సూచనలు చేసినారు,

విద్యార్థి, విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపినారు. అనంతరం వారు తనిఖీల్లో భాగంగా ఇల్లందు సబ్ జైల్ సందర్శించి పలు రికార్డులు పరిశీలించినారు. ఖైదీలకు మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయి లేవో అడిగి తెలుసుకున్నారు, ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఫ్రీ లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది నియమిస్తామని తెలిపినారు. తనిఖీల అనంతరం ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టును సందర్శినారు. వారికి ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి పుష్పగుచ్చంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించినారు. అనంతరం ఇల్లందు బార్



అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అధ్యక్షుడు పాటు కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసినారు. బార్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో వారి తో పాటు, ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి, న్యాయవాది నిరంజన్ రావు ,బార్ అధ్యక్షుడు బి.రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కీర్తి కార్తిక్, సీనియర్ న్యాయవాదులు పి. బాలకృష్ణ టి. ప్రభాకర్, పి జయప్రకాష్, పి. అనిల్ కుమార్, పాల్గొన్నారు

## కులగణనపై అసెంబ్లీ తీర్మానం చేస్తుందని అనుకున్నాం

**మాజీ స్పీకర్ మధుసూధనాచారి విమర్శలు**

**వరంగల్,ఫిబ్రవరి13:** కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తెస్తారని అనుకున్నామని.. తూతూ మంత్రంగా ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారని శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనా చారి అన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి కాస్కో అంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ మౌనం.. దాని పర్యావసానం గురించి వైఎస్సార్, చంద్రబాబుకు తెలుసునని.. రాబోయే రోజుల్లో కేసీఆర్ ధాటికి రేవంత్‌రెడ్డి వణికిపోవడం ఖాయమన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కడియం శ్రీహరికి ప్రాధాన్యత ఇచ్చి డిప్యూటీ సీఎం పదవి ఇస్తే.. పార్టీకి మోసం చేశాడని మండిపడ్డారు. దమ్ము, ఆత్మ విశ్వాసం ఉంటే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మళ్లీ పూర్తిస్థాయిలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాల్సిందేనన్నారు. తూ తూ మంత్రంగా కుల గణనను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని.. విమర్శించారు. బీఆర్‌ఎస్ ఒత్తికి దిగివచ్చిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని.. రీ సర్వే ఘనత బీఆర్‌ఎస్‌దేనన్నారు. గుడిసె వాసులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

## చిరుమళ్లలో చండికా ఉపాసకులకు అరుదైన ఆహ్వానం



**తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి13:**
ఆదివాసీ ఆధ్యాత్మిక కేరళ గురూజీలు చండికా ఉపాసకులు హరికృష్ణ స్వామిజీ నిర్మల్ జిల్లా మామిడి మండలానికి చెందిన రచ్చ కోట పంద్రం జాలిష్ మహారాజ్ స్వామీజీ, దేవనగరం సమ్మక్క గద్దెల పూజారి తోలెం నాగయ్య లకు చిరుమళ్ళ చందా వంశీయులు మరియు జాతర కమిటీ మరియు సభ్యులు అత్యంత అరుదైన పద్ధతిలో ఆహ్వానం పలికారు ఆదివాసీ వాయిద్యాలు డోలి శబ్దాలతో అత్యంత ఆదివాసీ దార్మిక పద్ధతిలో సమ్మక్క గద్దెల వరకు చిరుమళ్ళ పురవీదుల్లో పాదాలు భూమి పై కాకుండా వస్త్రాలపై నడిపించారు. అబాలగోపాలం ఆహ్వానంలో పాల్గొన్నారు గ్రామ ఆదివాసీ ఆడపడుచులు హారతులు పట్టారు అత్యంత భక్తి శ్రద్దలతో తల్లి గద్దెల వద్దకు గురూజీలను తీసుకెళ్లారు తర్వాత సమ్మక్క తల్లికి ప్రత్యేక పూజలు చేసారు.



## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ట



**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 13**
దంతాలపల్లి మండలం దాట్ల గ్రామంలో ముదిరాజు కులస్తుల ఆరాధ్య దైవం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రాణ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బండ ప్రకాష్ హాజరై పెద్దమ్మతల్లిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సోంపేట రాము, రవి చిల్ల సహదేవ్, ముదిరాజు కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల దగ్గర కూరగాయలు కొన్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 13**
పాలకుర్తి మండలం లోని చెన్నూరు గ్రామంలో పర్యటన ముగించుకున్న అనంతరం క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న మార్గం మధ్యలో పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి మార్గమధ్యలో ఆగి సాధారణ మహిళల కూరగాయలు కొనుగోలు చేశారు ఈ సందర్భంగా అక్కడ ఉన్న ప్రజలతో మమేకమై వారి జీవన పరిస్థితులు ఇబ్బందుల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు ప్రజల సమస్యలు అభిప్రాయాలు అవసరాల గురించి నేరుగా మాట్లాడటం ద్వారా సమాజానికి మరింత దగ్గరగా ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు ప్రజాసేవలో నిస్వార్థంగా పనిచేసే తన లక్ష్యాన్ని మరోసారి స్పష్టంగా తెలియజేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని దృఢంగా చెప్పారు ఇట్టి కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## చిరుమళ్లలో చండికా ఉపాసకులకు అరుదైన ఆహ్వానం

**తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి12:**
ఆదివాసీ ఆధ్యాత్మిక కేరళ గురూజీలు చండికా ఉపాసకులు హరికృష్ణ స్వామిజీ నిర్మల్ జిల్లా మామిడి మండలానికి చెందిన రచ్చ కోట పంద్రం జాలిష్ మహారాజ్ స్వామీజీ, దేవనగరం సమ్మక్క గద్దెల పూజారి తోలెం నాగయ్య లకు చిరుమళ్ళ చందా వంశీయులు మరియు జాతర కమిటీ మరియు సభ్యులు అత్యంత అరుదైన పద్ధతిలో ఆహ్వానం పలికారు ఆదివాసీ వాయిద్యాలు డోలి శబ్దాలతో అత్యంత ఆదివాసీ దార్మిక పద్ధతిలో సమ్మక్క గద్దెల వరకు చిరుమళ్ళ పురవీదుల్లో పాదాలు భూమి పై కాకుండా వస్త్రాలపై నడిపించారు.అబాలగోపాలం ఆహ్వానంలో పాల్గొన్నారు గ్రామ ఆదివాసీ ఆడపడుచులు హారతులు పట్టారు అత్యంత భక్తి శ్రద్దలతో తల్లి గద్దెల వద్దకు గురూజీలను తీసుకెళ్లారు తర్వాత సమ్మక్క తల్లికి ప్రత్యేక పూజలు చేసారు

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

**కామారెడ్డి,ఫిబ్రవరి13:** రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు కామారెడ్డి ఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ఏరియాలను ఎస్పీ పరిశీలించారు. గతేడాది కాలంగా ఎక్కువగా యాక్సిడెంట్లు జరిగిన ప్రాంతాలను హాట్ స్పాట్‌లుగా గుర్తించి ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాసంపల్లి, టెకిర్యాల్ శివార్లను ఆమె పరిశీలించారు. స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయడం,హెచ్చరిక బోర్డుల ఏర్పాటు అంశాలపై సూచనలు చేశారు. రూరల్ సీఐ రామన్ దేవునిపల్లి ఎస్సై రాజు ఉన్నారు.

# రాబోయే ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదు

**బి ఆర్ ఎస్ మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 13**
తొర్రూరు మండల కేంద్రంలో శ్రీనివాస గార్డెన్ లో ఏర్పాటు చేసిన మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వం పై ఘాటు వ్యాఖ్యలు చేశారు రానున్న స్థానిక ఎలక్షన్లలో కాంగ్రెస్ గెలువదని అందుకే జరగాల్సిన ఎలక్షన్ ను పోస్ట్ పోన్ చేసింది అన్నారు రానున్న స్థానిక ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీని గెలిచే పరిస్థితిలో లేదు కావున ఎవరు నమ్మలేని పరిస్థితికి ప్రభుత్వం దిగజారిపోయిందని అన్నారు ఎవరు భయపడకండి మీకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అని వ్యక్తం చేశారు మహిళలను మోసం చేసి ఓట్లు వేసుకున్న వారిని ప్రశ్నించండి ఎన్నో కేసులు పెట్టిన భయపడే ప్రసక్తే లేదు అన్నారు కర్షకులకు కనీసం సాగునీళ్లు అందీయ లేని స్థితిలో ఈ ప్రభుత్వ ఉంది తొర్రూరులో వంద పడక ఆసుపత్రి ఎటుపోయింది కేసీఆర్ కిట్టు న్యూట్రిషన్ కిట్టు ఎటు పోయింది మోసపూరిత హామీలతో అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా అబద్ధాలతోనే కాలం వెలదీస్తుంది అన్నారు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచులు ఎంపీటీసీలు, జడ్పిటిసిలు 6 మండలాల్లో బి ఆర్ ఎస్ పార్టీ గెలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు ఎన్నికల్లో పంచిన గ్యారంటీ కార్డులు ఎటు పోయినాయి అని ప్రశ్నించారు స్థానిక ఎన్నికలు వస్తున్నాయని గ్రామసభలు పెట్టి గ్రామాల్లో అలజడి సృష్టించారు కానీ అట్టి గ్రామ సభలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు అందుకనే ఈ పరిపాలన నచ్చక ప్రజలు బి ఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని ప్రభుత్వం ఎలక్షన్లను పోస్ట్ ఫోన్ చేసిందని అన్నారు ఇట్టి కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు జెడ్పిటిసిలు మాజీ కౌన్సిలర్లు వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు

# చిరుమళ్ళలో పరిపూర్తి అయిన గుడిమెలుగు

**పగిడిద్ద రాజు సారలమ్మలు గద్దెకు వస్తున్న సన్నివేశంతో రెండవ రోజు జాతర మొదలు అవుతుంది**

**తలపతులు చందావీరయ్య,వడ్డెలుగా సిద్దబోయిన వెంకటేశ్వర్లు మోహన్ రావులు పాల్గొన్నారు**







**తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి 12:**
చిరుమళ్ల సమ్మక్క జాతర మొదటి రోజు ఘట్టం సమ్మక్క పానుపు ను గద్దెల పైకి తీసుకురావడం,తల్లి ఆభరణాలు గద్దెల వద్దకు తీసుకురావడం ఆసక్తిని కనపర్చింది, ఆర్తి డోలు శబ్దాల మోతలు, ఆదివాసీ ఆభాల గోపాలం పాల్గొని ఈలలు బారి అరుపులు, కేకలతో గద్దెల ప్రాంగణం వల్లు గగురు పొడిచే సన్నివేషం సమ్మక్క గుడి చుట్టూ ఉన్న భక్తులను అప్రమత్తం చేసింది. అత్యంత భక్తి శ్రద్దలను కనపర్చింది

తర్వాత, సమ్మక్క పానుపు ఆభరణాలకు ప్రత్యేక పూజలో తలపతిగా చందా వీరయ్య పాల్గొనగా ఆయన పర్యవేక్షణ లో గుడి మెలుగు కట్టు తీశారు, ఈ కార్యక్రమం లో తలపతులు వడ్డెలుపసుపు కుంకుమ పూజలు నిర్వర్తన పూర్తి అయ్యింది.రాత్రి రెండు గంటల సమయం వరకు పూర్తి అయ్యింది, మోహన్ రావు,సిద్దబోయిన వెంకటేశ్వర్లు కల్తీ చంద్రయ్య పాల్గొన్నారు, వీరితో గుడి కట్టు నిర్వహించారు తల పతి చందా వీరయ్య ఆధ్వర్యంలో గుడి మెలుగు పూర్తి అయ్యింది, రెండవ రోజు, బుధవారం 12వ తారీకు పగిడిద్ద రాజు మరియు సారలమ్మ లను మేనమామల ఇంటినుండి రాత్రి చిరుమళ్ల సమ్మక్క గద్దెల వద్దకు తీసుకునిరావడం సన్నివేశం ఉంటుంది

# ముసలమ్మ గుట్ట నుండి బయలెల్లిన సమ్మక్క తల్లి

**చందా గోవర్ధన్ మార్గ నిర్దేశంలో సమ్మక్కను తీసుకొని తీసుకొస్తున్న టీం**


**గురువారం రాత్రి 2గంటలకు గుట్టకు చేరుకున్న చందా వంశీయులు, కోయ పుణ్యం ధర్మం ప్రచారక్ చుంచు రామకృష్ణ,వడ్డె సిద్ద బోయిన వెంకటేశ్వర్లు, తదితరులు**

**క్షణ క్షణం సమ్మక్క కళ్యాణం విజయవంతం కావడానికి కార్యదీక్షితులుగా ఆదివాసి 9తెగల సమన్వయకర్త.చుంచు రామకృష్ణ**









**తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి 13:**
భద్రాద్రి కొత్తగూడెం కరకగూడెం మండలం చిరుమళ్ల లో సమ్మక్క సారక్క ల కళ్యాణం కోసం సర్వం సిద్ధం చేసారు. రాత్రి రెండు గంటలకు చిరుమళ్ల సమీపంలో లో ఉన్న ముసలమ్మ గుట్ట నుండి సమ్మక్క తల్లిని తీసుకొని రావడానికి చందా గోవర్ధన్ పదనిర్దేశంలో కోయ పుణ్యం ధర్మ ప్రచారక్ చుంచు రామకృష్ణ నేత్రుత్వం లో గుట్టకు చేరారు,ఆదినాటి ఆదివాసి సంప్రదాయ పద్దతిలో తల్లి సమ్మక్క కుంకుమ భరిణ రూపం లోఈరోజు ఉదయం 10గంటలకు కళ్యాణ గద్దెల వద్దకు రానున్నారు గుట్టను ఆరోహించిన చందా వంశీయులు చందా ప్రశాంత్ చందా అశోక్ మైపతి అరుణ్ కుమార్ చందా మధు, చందా ప్రదీప్, కొమరం నరేష్ చందా శ్రీనివాస్, పోలె బోయిన ప్రేమ్ కుమార్ తదితరులు ఉన్నారు.. వీరంతా తెల్లవారి మూడు గంటల సమయంలో ముసలమ్మ తోగులో స్నానం ఆచరించారు. మొదట గంగమ్మ,పురాణకాలం నాటి శివుని గుడిలో పూజలు అర్చనలు చేశారు. తల్లికి పసుపు పారాణి, పట్టు చీర ఇతర వస్త్రాలు సమర్పణ చేశారు ఇతర ఆదివాసీ సంప్రదాయం దార్మిక పద్ధతుల్లో అన్ని ప్రక్రియలు పూర్తి చేశారు.రాత్రి 12గంటల సమయంలో శుభ ముహూర్తాన. కళ్యాణం జరగనున్నది. తలపతి చందావీరయ్య ధర్మకర్త బిక్షపతి, భూపతి, చందా వంశపెద్దలు మాజీ



శాసనసభ్యులు, చందా లింగయ్య కళ్యాణం లో పాల్గొని విజయవంతం చేయనున్నారు.

# 100 పడకల హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

**సిపిఐ రాష్ట్ర నాయకులు సమ్మెర విశ్వేశ్వరరావు**



**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి 13**
తొర్రూరు డివిజన్ కేంద్రంలో పేద బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ప్రభుత్వ వైద్యం కోసం మంజూరైన వంద పడకల ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు తొర్రూర్ లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన మూడు పార్టీల నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో ప్రజలకు అవసరమైన డిమాండ్లను సాధించటం కోసం ఉద్యమం సాగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటిపోయిన ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ముఖ్యమైన ప్రభుత్వ ఆస్పటల్ నిర్మాణాన్ని చేపట్టకపోవడం బాధ్యతారహి త్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా యుద్ద ప్రాతిపదికన ప్రభుత్వ0 100 పడకల హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మాటలతో కాలయాపన తప్ప ఆచరణలో అడుగు ముందుకు పడటం లేదని అన్నారు. తొర్రూరు ప్రాంతం పేరుతో సబ్ ట్రెజరీ ఆఫీస్ వేరే దగ్గర ఉందని దాన్ని తొర్రూరులో ఏర్పాటు చేయటంలో నేటి ప్రభుత్వం కూడా విఫలమైందని అన్నారు. తొర్రూరు పట్టణంలో డ్రైనేజీ పనుల పురోగతిలో సిసి రోడ్ల నిర్మాణాలు, తొర్రూరు పెద్ద చెరువు వద్ద నిలిచిపోయిన మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు రైతులకు అంతర్గత రోడ్ల సమస్య తీవ్రంగా ఉందని వాటిని గుర్తించి పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. పరిష్కారం కోసం దశల వారి ఆందోళనకు సిద్ధమైనట్టు వారు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రజలు మా పోరాటంలో భాగస్వామ్యం కావాలని వారు పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు హెూమ బిక్షపతి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న సిపిఎం మండల కార్యదర్శి ఎండి యాకుబ్, సిపిఐ మండల కార్యదర్శి బందు మహేందర్, బానోతు లక్ష్మణ్, వెంకటేశ్వర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# సరిహద్దుల్లో స్థిరంగానే పరిస్థితులు

**పూంఛ్ ఘటనపై సైన్యం వివరణ**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి13:** భారత్-పాక్ సరిహద్దుల్లో పరిస్థితి నిలకడగానే ఉందని భారత సైన్యం ప్రకటించింది. తాజాగా నేడు పాక్ కవ్వింపులకు గట్టిగా బుద్ధి చెప్పిన నేపథ్యంలో ఆర్మీ స్పందించింది. ఇక్కడ అస్థిర పరిస్థితులు నెలకొన్నట్లు వచ్చిన వార్తలను ఖండించింది. కాల్పుల విరమణ స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌లో పూంఛ్ జిల్లా కృష్ణ ఘాటి సెక్టార్‌లో బుధవారం రాత్రి కాల్పుల విరమణ ఉల్లంఘన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖ వెంబడి తార్కుండి ప్రాంతంలో ఉన్న ఫార్వర్డ్ పోస్ట్‌పై పాక్ సైన్యం కాల్పులను భారత బలగాలు తిప్పికొట్టాయి. వీటిల్లో శత్రువుల వైపు 'భారీగా ప్రాణనష్టం' జరిగిందని భద్రతా అధికారులు వెల్లడించారు. అయితే, మృతుల సంఖ్య వివరాలను మాత్రం స్పష్టంగా చెప్పలేదు. కాల్పుల విరమణ ఉల్లంఘనకు సంబంధించి ఈ ఏడాదిలో ఇదే తొలి ఘటన. అయితే, గత కొన్ని రోజులుగా వివిధ మార్గాల్లో పాక్ కవ్వింపులకు పాల్పడుతూనే ఉంది. ఫిబ్రవరి 4, 5 తేదీల మధ్య అర్ధరాత్రి కొంతమంది చొరబాటుదారులు భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భారత సైన్యం వారిపై కాల్పులు జరిపింది. ఈ ఘటనలో ఏడుగురు హతమయ్యారు. వీరిలో కొందరు పాక్ భద్రతా సిబ్బంది ఉన్నట్లు సమాచారం. ఇక, ఫిబ్రవరి 8న రాజౌరీ సెక్టార్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఓ సైనికుడికి గాయాలయ్యాయి. జమ్మూ కశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్ సమీపంలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద మంగళవారం జరిగిన బాంబు పేలుడులో ఇద్దరు సైనికులు మరణించారు. మరొకరు గాయపడ్డారు. మృతుల్లో ఒకరు కెప్టెన్. 'భారత్-పాక్ సైన్యాల మధ్య పరస్పర అవగాహనతో కాల్పుల విరమణ ఒప్పందం చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. సరిహద్దుల వద్ద కాల్పులు, ఐఈడీ పేలుడు వంటి ఘటనలతో కొంత కలకలం రేగింది. కానీ, ఇప్పటికే ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఏర్పాటుచేసిన వ్యవస్థతో పరిస్థితిని అదుపు చేశాము. ఎటువంటి భారీ క్యాలిబర్ ఆయుధాలతో కాల్పులు జరగలేదని భారత సైన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది. చెదురుమదురు ఘటనలు మాత్రమే చోటు చేసుకొన్నాయన్న సైన్యం.. అసాధారణ పరిస్థితి నెలకొందన్న ప్రచారాన్ని తోసిపుచ్చింది. చిన్న ఘటనలు ఇక్కడ అసాధారణమేమీ కాదని తెలిపింది. భారత్ ఆందోళనలను పాక్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొంది. ప్రస్తుతం పరిస్థితి స్థిరంగా ఉందని పేర్కొంది. నియంత్రణ రేఖ వద్ద భారత సైన్యం పూర్తి అప్రమత్తతో ఉన్నట్లు వెల్లడించింది. నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద బుధవారం సాయంత్రం పాకిస్తాన్ సైన్యం కాల్పుల విరమణను ఉల్లంఘించింది. పాకిస్తాన్ సైన్యం వరసగా అనేక రౌండ్ల కాల్పులు జరుపుతూ కవ్వింపు చర్యలకు పాల్పడటంతో.. భారత బలగాలు కూడా అందుకు ధీటుగా బదులిచ్చాయి. మన దేశ సైన్యం శత్రువుల కాల్పులను సమర్థంగా తిప్పికొట్టంతో దాయాది సైన్యం నుంచి కాల్పులు ఆగిపోయాయి. శత్రుసైన్యం తోకముడుచుకుని పారిపోయింది.భారత సైనికులను లక్ష్యంగా చేసుకోవడానికి ఉగ్రవాదులు ముళ్ల తీగల కంచె దగ్గర ఐఈడీని అమర్చారని వర్గాలు తెలిపాయి. పూంచ్ సెక్టార్‌లోని ఎల్‌ఓసీ వద్ద జరిగిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఒక సైనికుడు గాయపడ్డాడని వర్గాలు తెలిపాయి.

## డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన

# జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్





**చర్ల, ఫిబ్రవరి 13**

చర్ల మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రి సిహెచ్ సి సెంటర్ ని గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంలో చర్ల ప్రభుత్వ ఆసుపత్రి సిహెచ్‌సి సెంటర్లో ఏర్పాటుచేసిన ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని భద్రాద్రి కొత్త జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు.ఈ సందర్భంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆసుపత్రి సిబ్బందిని ఆసుపత్రిలో గల వసతులను ఆస్పత్రికి ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకోవడం జరిగింది మరియు ఆసుపత్రిలో గల వసతులపై జిల్లా కలెక్టర్ ఆసుపత్రి సిబ్బందికి ఆసుపత్రి శుభ్రతపై , ఆసుపత్రి ప్రాంగణంలో చెట్లను నాటే విధంగా సూచనలు ఇచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ కిడ్నీ సమస్య ఉన్న పేషెంట్స్ చర్ల వెంకటాపురం చుట్టుపక్కల ప్రాంతాల వారు ఏ సమస్య వచ్చినా భద్రాచలం కి వెళ్ళవలసి వస్తున్నదని వారి సమస్యను పరిష్కరించే భాగంలో చర్ల మండలంలోని సీమాంగ్ సెంటర్లో ఉచిత డయాలసిస్ వార్డుని ఏర్పాటు చేశామని దీనివల్ల చుట్టుపక్కల ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు ఈ యొక్క ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ డయాలసిస్ వార్డ్ లో ఐదు మిషిన్స్ అందుబాటులో ఉన్నాయని డాక్టర్లని అందుబాటులో ఉంచామని ఏ సమస్య వచ్చిన మీరు ఈ ఆసుపత్రి కి వచ్చి చికిత్స తీసుకోవచ్చని అన్నారు .ఇదేవిధంగా సిహెచ్ సెంటర్లో రక్త పరీక్ష కేంద్రము, మందులు ,ప్రసూతి భవనం గురించి శవపరీక్ష కేంద్రంము లో స్టాఫ్ లేరని భవనము కూడా ప్రారంభం కాలేదని దానివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని అక్కడికి వచ్చినవారు కలెక్టర్ దృష్టికి తీసుకునివచ్చారు తొందరలోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని జితేష్ వి పాటిల్ అన్నారు.

**బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కై కలెక్టర్ కి చర్ల సీనియర్స్ ప్రెస్ క్లబ్ పాత్రికేయుల వినతిపత్రం**

ఈ సందర్భంలో చర్ల సీనియర్స్ ప్రెస్ క్లబ్ సీనియర్ పాత్రికేయులు దొడ్డ ప్రభుదాస్ ,జవ్వాది మురళి కలెక్టర్ దృష్టికి చర్ల మండలంలో సీమాంగ్ సెంటర్లో రక్త నిధిని ఏర్పాటు చేయవలసిందిగా ఈ బ్లడ్ బ్యాంక్ అనేది ఇక్కడ అందుబాటులో లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు రోగులు గురి అవుతున్నారని చాలామంది భద్రాచలం వెళ్ళవలసి వస్తుందని అదే మీరు ఇక్కడ బ్లడ్ బ్యాంక్ ని ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్లయితే చర్ల ,వెంకటాపురం, ఛత్తీస్గడ్ ,ఒరిస్సా రాష్ట్రాల నుంచి మరియు చుట్టుపక్కల ప్రాంతాలు వారు కూడా వచ్చి ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు వినతిపత్రం ఇవ్వటం జరిగింది దీనికి సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ చర్ల సిహెచ్సి సెంటర్లో బ్లడ్ బ్యాంక్ ను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని తొందరలోనే చర్ల సిహెచ్సి సెంటర్లో బ్లడ్ బ్యాంక్ ని ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభానికి వచ్చిన కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను అక్కడకు వచ్చిన పేషెంట్స్ శాలువాతో సన్మానం చేసారు ఇక్కడ ఈ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయటం వలన మాకు ఎంతగానో ఉపయోగపడుతోంది అని ప్రతి సారి మేము భద్రాచలం వెళ్ళవలసి వస్తుందని డయాలసిస్ పేషెంట్లు చాలామంది ఉన్నారని మీరు ఇక్కడ ఈ కేంద్రాన్ని పెట్టడం మాకు చాలా ఉపయోగకరంగా ఉందని అన్నారు . అదేవిధంగా చాలామంది తమ తమ సమస్యలని కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగింది మీ సమస్యలని పరిష్కారం చేసే దిశగా ఆలోచిస్తానని సంభందిత అధికారులకు కలెక్టర్ సూచనలు ఇవ్వడం జరిగినది .ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ సాయి వర్ధన్ ,డి సి హెచ్ ఎస్ రవిబాబు చర్ల తాసిల్దార్ శ్రీనివాస్, ఏంపీడిఓ ఈదాయా ,ప్రభుత్వ అధికారులు , ఆస్పత్రి సిబ్బంది పత్రిక విలేకరులు తదితరులు పాల్గొనడం జరిగింది.



# మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట

## ముందస్తు బెయిల్ మంజూరు

**హైదరాబాద్,ఫిబ్రవరి13:** సినీ నటుడు మోహన్‌బాబుకు సుప్రీం కోర్టులో ఊరట లభించింది. జర్నలిస్టు పై దాడి కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన సుప్రీంకోర్టులో ఫిటీషన్ వేశారు. దీనిపై గురువారం విచారణ జరిపిన న్యాయస్థానం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసును జస్టిస్ సుదాంశ్ దులియా ధర్మాసనం విచారణ జరిపింది. గత విచారణ సందర్భంగా మోహన్‌బాబుపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు తెలంగాణ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా జర్నలిస్ట్‌పై జరిగిన దాడికి తాను బహిరంగంగా క్షమాపణ చెప్పానని.. నష్ట పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నానని మోహన్ బాబు ధర్మాసనానికి చెప్పారు. కాగా జర్నలిస్టుపై దాడి కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సినీ నటుడు మోహన్‌బాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. దీంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మోహన్‌బాబు ఆయన కుమారుడు మంచు మనోజ్ మధ్య ఘర్షణల నేపథ్యంలో జల్‌పల్లిలో ఉన్న మోహన్‌బాబు ఇంటికి వార్తల కవరేజీ కోసం వెళ్లిన తనపై మోహన్‌బాబు దాడి చేశారని పేర్కొంటూ జర్నలిస్టు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పహడీ షరీఫ్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ మోహన్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు కొట్టివేసింది. గత ఏడాది డిసెంబరు 10న మోహన్ బాబు తనయుడు మంచుమనోజ్ విజ్ఞప్తి మేరకు ఆయన వెంట మీడియా మోహన్‌బాబు ఇంటికి రాగా ఆయన ఒక విలేకరి దగ్గరున్న మైక్‌ను లాక్కొని తల మీద కొట్టారు. తీవ్ర గాయాల పాలైన విలేకరిని ఆస్పత్రిలో చేర్చారు. రాచకొండ పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసుకుసంబంధించి కోర్టులో వాదనల సందర్భంగా జర్నలిస్టు రంజిత్ తరఫు న్యాయవాది వాదిస్తూ, మోహన్‌బాబుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. జర్నలిస్టుపై దాడి చేయడమే కాకుండా గొంతు పట్టి నులిమారని చెప్పారు. ఈ మేరకు ఇరు వర్గాలు అఫిడవిట్లు దాఖలు చేశాయి. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మోహన్‌బాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. క్రిమినల్ కేసు కావడంతో డివిజన్ బెంచ్‌కు అప్పీలు చేసే అవకాశం లేదు. దీంతో ముందస్తు బెయిలు కోసం మోహన్‌బాబు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# మాజీ ఎమ్మెల్యే నేరాలు అంతా ఇంతా కావు

## వైసీపీ పాలనలో వంశీ అనేక దాడుల్లో నేరస్తుడు : కొనకళ్ల నారాయణరావు

**అమరావతి,ఫిబ్రవరి13:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఓ విధ్వంసకారుడని ఆర్టీసీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు అన్నారు. వల్లభనేని వంశీ అరెస్టు నేపథ్యంలో గురువారం టీడీపీ కార్యాలయంలో కొనకళ్ల నారాయణరావు మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై వల్లభనేని వంశీ దాడి చేయించి విధ్వంసం సృష్టించారని మండిపడ్డారు. అనేక మంది టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టించి వేధించారని అన్నారు. టీడీపీ కార్యాలయంపై ఆయనే దాడి చేయించి టీడీపీ నేతలను అరెస్ట్ చేయించారని చెప్పారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ మహిళా నేతలను కూడా జైలుకు పంపించారని మండిపడ్డారు. గన్నవరంలో వంశీ అరాచకాలు అన్నీ ఇన్నీ కావని చెప్పుకొచ్చారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి కొన్ని వందల కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. వల్లభనేని వంశీపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాదుదారుడైన సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసి బెదిరించాడని ధ్వజమెత్తారు. సత్యవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు.

**వల్లభనేని చరిత్ర మొత్తం నేరమయం : ఎంవీ ప్రణవ్‌గోపాల్**

ఒక నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు మరో నేరానికి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాల్పడ్డారని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ చెప్పారు. వంశీ గత చరిత్ర అంతా నేర మయమని ఆరోపించారు. జగన్ గ్యాంగ్‌లో చేరి అనేక అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. దళిత యువకుడు సత్యవర్ధన్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వల్లభనేని వంశీ అరెస్టు జరిగిందన్నారు. ఈ అరెస్టును ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారని ప్రణవ్ గోపాల్ చెప్పారు.

**వంశీ, దేవినేని అవినాష్, కొడాలి నాని చీడపురుగులు : నాదెండ్ల బ్రహ్మం**

వల్లభనేని వంశీ లాంటి వారిని వేటాడే ఆట మొదలైందని టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం తెలిపారు. వంశీ , దేవినేని అవినాష్ , కొడాలి నాని చీడపురుగులు అని విమర్శించారు. కన్నతల్లి లాంటి పార్టీ కార్యాలయంపై దుర్మార్గులు దాడి చేశారని మండిపడ్డారు. ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరిని ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడిన వంశీకి తగిన శాస్తి జరిగిందని చెప్పారు. వంశీ అరెస్టుతో కూటమికి ఓటేసిన ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

# మాలలతో మాదిగలే తట్టుకోలేదు

**మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారు..?**

**రిజర్వేషన్ ఫలాలు అందరికీ దక్కాలి**

**మహార్, నేతకాని కులాలకు న్యాయం జరిగేలా చూస్తా : మందకృష్ణ మాదిగ**

**హైదరాబాద్,ఫిబ్రవరి13:** రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగ సామాజిక వర్గమే మాలలతో తట్టుకోలేకపోయిందని, వర్గీకరణ గ్రూపు-3లో ఉన్న మహార్, నేతకాని కులస్థులు ఎలా తట్టుకుంటారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ వర్గీకరణ సరైందని, రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలని చెప్పారన్నారు. జాతీయ మహార్ నేతకాని ఐక్య వేదిక ఆధ్వర్యంలో వేదిక నాయకులు నారాయణ దుర్గే మహార్ అధ్యక్షతన సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మహార్, నేతకానిలకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేసి రిజర్వేషన్ కేటాయించాలనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో మందకృష్ణ మాదిగ, పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ బోర్లకుంట వెంకటేష్ నేత ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మహార్, నేతకాని కులాలకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు. దళితుల జీవితాలను బాగు చేసిన అంబేద్కర్ మహార్ జాతికి చెందిన వారేనన్నారు. దళితులలో 59 కులాలకు దక్కాల్సిన వాటాను ఒక్క మాల కులమే ఇప్పటి వరకు అనుభవించిందని ఆరోపించారు. సర్టిఫికెట్‌ల కోసం మహార్, నేతకానిలు తమ అస్థిత్వం కోల్పోవద్దని, తహసీల్దార్‌ల ద్వారా కుల సర్టిఫికెట్ సాధించుకోవాలని సూచించారు.

# రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు

**ప్రభుత్వ వైఫల్యాలపై మండలిలో ప్రశ్నిస్తా : బొత్స సత్యనారాయణ**

**అమరావతి,ఫిబ్రవరి13:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తుందని, ఎప్పుడు అక్రమ కేసులు పెడదామా అని ఎదురుచూస్తుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని వంశీపై మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పందించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. వల్లభనేని వంశీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేసు వెనక్కు తీసుకుంటే మళ్ళీ అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. కక్ష పూరిత రాజకీయాలు చేయడం మంచి పద్ధతి కాదని.. ఇలాంటివి రాజకీయాలలో సరికాదని పేర్కొన్నారు. ఋషికొండ భవనాలు ప్రభుత్వ కట్టడాలు...నిర్మాణాలలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను మండలిలో ప్రశ్నిస్తామని.. శాసనసభ విషయంలో పార్టీ వైఖరిని తమ వాళ్ళను అడిగి చెప్తానని.. తనకు తెలియని విషయాన్ని తెలుసుకొని చెప్తానని అనడంలో తప్పు లేదు కదా అని బొత్స అన్నారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువులు ధరలు పెరిగిపోతున్నాయని, పండగ కూడా బాగా చేసు కోలేకపోయారని బొత్స సత్యనారాయణ అన్నారు. ఇంకా వేసవి రాకుండానే పవర్ కట్స్ విధిస్తున్నారని, వైసీపీ హయంలో స్కూల్స్ మూసేసారని దుష్ప్రచారం చేశారని అన్నారు. ఇప్పుడు ఫైల్స్ క్లియరింగ్ ఎందుకు ఆలస్యం అవుతుందని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పారు కదా అని బొత్స ప్రశ్నించారు. ఇప్పటికీ ఒక సిలెండర్ మాత్రమే ఇచ్చారని...తల్లి కి వందనం ఇస్తామని అంటున్నారని.. రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవడం లేదని, నిరుద్యోగ భృతి ఏమైందని నిలదీశారు. గత 5 ఏళ్లలో జరిగిన దాని కంటే..ఈ 9 నెలల్లో ఎక్కువ జరిగాయని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వం తప్ప,.. చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. మండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తామన్నారు. గత టీడీపీ, వైసీపీ హయంలో భూకుంభకోణంపై వేసిన సిట్ నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

## వల్లభనేని వంశీని అరెస్టు చేసిన పోలీసులు

**అమరావతి,ఫిబ్రవరి13:** వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వల్లభనేని వంశీని ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఉదయం ఏడు గంటలకు హైదరాబాద్‌లో ఆయన ఇంటికి చేరుకున్న పోలీసులు, నోటీసులు ఇచ్చి అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆయనను తరలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గన్నవరం టీడీపీ ఆఫీసుపై వైసీపీ నేతలు దాడి చేశారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే వంశీ నిందితుడిగా ఉన్నారు. కొన్ని రోజుల కిందటే వంశీ అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పట్నుంచి వంశీ కోసం గాలి స్తున్నారు. వంశీ ఆచూకీ పోలీసులకే కాదు.. సొంత పార్టీ నేతలకు కూడా తెలియలేదు. 2023, ఫిబ్రవరి 20న గన్నవరం టీడీపీ కార్యాలయంపై అప్పటి ఎమ్మెల్యే వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. సుమారు 5 గంటలపాటు టీడీపీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారు. దీనిపై అప్పట్లో టీడీపీ నాయకులు కేసులు పెట్టినా పోలీసులు విచారణను అటకెక్కించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ కేసు ఊపిరిపోసుకుంది. అప్పట్లో విధ్వంసం సృష్టించిన వారిలో 20 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# వర్క్ ఫ్రమ్ కారు...టెక్కీకి వేయి జరిమానా

## బెంగళూరులో సంచలన కేసు

**బెంగళూరు,ఫిబ్రవరి13:** వర్క్‌ఫ్రమ్ హోమ్ అంటే కారులో డ్రైవ్ చేస్తూ..చేసే పనికాదని బెంగళూరు పోలీసులు గట్టి షాక్ ఇచ్చారు. రైళ్లు, బస్సుల్లో ప్రయాణిస్తూనే ఐటీ ఉద్యోగులు కొందరు ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తూ ఉండటం మనం అప్పుడప్పుడు గమనిస్తున్నాం. అలా బెంగళూరుకు చెందిన ఓ మహిళ కూడా ప్రయాణవేళల్లో వర్క్ చేసింది. అయితే ఆ సమయంలో ఆమె కారు నడుపుతూ ల్యాప్‌టాప్‌లో వర్క్ చేయడం వివాదాస్పదమైంది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కాగా.. దీనిపై పోలీసులు చర్యలు చేపట్టారు. బెంగళూరులోని ఆర్టీ నగర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ కారు డ్రైవ్ చేస్తూనే ల్యాప్‌టాప్‌లో వర్క్ చేస్తుంది. దీన్ని ఎవరో వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. అదికాస్తా వైరల్‌గా మారి ట్రాఫిక్ పోలీసుల కంట పడింది. దీంతో ఆమెను ట్రాక్ చేసిన పోలీసులు వెయ్యి రూపాయిలు జరిమానా విధించారు. అంతేకాక.. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆ మహిళ వీడియోతో పాటు అదుపులోకి తీసుకున్న ఫొటోను ట్రాఫిక్ డీసీపీ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వర్క్ ఫ్రమ్ హోమ్ అనేది ఇంటి నుంచి చేసేది. కారు డ్రైవ్ చేస్తూ కాదు' అని రాసుకొచ్చారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101